క్లుప్తంగా

నేటి నుంచి ఉచిత ఫిజియోథెరపీ శిబిరం

కాచిగూడ: శ్రీ శ్యామ్‌మందిర్ సేవా సమితి ఆధ్వర్యంలో కాచిగూడ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీ శ్యామ్‌మందిర్ ప్రాంగణంలోని ఫిజియోథెరపీ సెంటర్‌లో పక్షవాతానికి ఉచిత ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించనున్నట్లు హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండా శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ నెల 15 నుంచి 21 వరకు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఉచిత ఫిజియోథెరపీ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. వివరాలకు సెల్: 9949238492లో సంప్రదించాలని సూచించారు.

జన్మదిన శుభాకాంక్షలు



మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో మంత్రిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నేడు సుందర్‌నగర్‌లో డ్రైనేజీ పనులు ప్రారంభం

కాచిగూడ: గోల్నాక డివిజన్, సుందర్‌నగర్ భావసార్ భవన్ లేన్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం ఉదయం ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్‌తో పాటు అధికారులు, స్థానిక బీఆర్‌ఎస్ నేతలు పాల్గొననున్నట్లు బీఆర్‌ఎస్ సీనియర్ నేత పేరి శేషు తెలిపారు.

మసీదుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలి



జీహెచ్‌ఎంసీ డీఎం యాదయ్యకు వినతి పత్రం అందజేస్తున్న వాజిద్‌హుస్సేన్

కవాడిగూడ: రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో మసీదుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జలమండలి ఎండీ దానకిషోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్, విద్యుత్ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ నరసింహస్వామిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజవర్గంలోని ఆరు డివిజన్లలో 29 ప్రధాన మసీదులు ఉన్నట్లు తెలిపారు. ఆయా మసీదుల్లో నిరంతరం విద్యుత్ సరఫరా, నీటి సౌకర్యం, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 23 నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానున్న రంజాన్ మాసంలో పెద్ద సంఖ్యలో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు. ఇఫ్తార్ విందులు, ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొప్ప వాగ్గేయకారుడు రామదాసు

చిక్కడపల్లి: తెలంగాణకు చెందిన గొప్ప వాగ్గేయకారుడు రామదాసు అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జనతా సేవా సమితి ఆధ్వర్యంలో భద్రాద్రి రామదాసు చరితం నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ రమణాచారి మాట్లాడుతూ రామదాసు జీవితాన్ని నాటక రూపంలో నరహరిరాజు రచించగా ఆయన కుమారుడు వీడీఎస్ రాజు ప్రదర్శించి తండ్రి రచనకు సార్థకత చేకూర్చారన్నారు. రామదాసుగా వీడీ ఎస్ రాజు, తనీషాగా రామకృష్ణ నటించారు. ఎస్.సత్యనారాయణ దుర్యోధన ఏకపాత్రాభినం ఆకట్టుకుంది. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో డాక్టర్ రమణాచారి మాట్లాడుతూ నాటక కళాకారులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సాహితీవేత్త కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, అర్వింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీఎస్-సెట్

ఉస్మానియా యూనివర్సిటీ: అధ్యాపక ఉద్యోగాల అర్హత పరీక్ష టీఎస్‌సెట్-2022 తొలిరోజు ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు. మంగళవారం టీఎస్‌సెట్ కార్యాలయంలో వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ సెట్ ప్రశ్న పత్రాలకు సంబంధించిన కోడ్‌ను విడుదల చేశారు. తొలిరోజు రాష్ట్ర వ్యాప్తంగా 30 కేంద్రాలలో రెండు విడతలుగా జరిగిన సెట్‌కు ఉదయం 80.2, మధ్యాహ్నం 83 శాతం అభ్యర్థులు హాజరైనట్లు ప్రొ.మురళీ కృష్ణ పేర్కొన్నారు.

అంబర్‌పేటను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలో ఉన్న ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించి రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం బర్కత్‌పుర హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కులో రూ.60 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వెంకటేష్, అధికారులు, స్థానిక కాలనీవాసులతో కలిసి పర్యవేక్షించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాను ప్రవేశపెడుతూ దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, బీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు ఎల్‌ఐజీహెచ్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వివేకానంద్, ప్రధాన కార్యదర్శి పొలిశెట్టి కిషోర్, కల్చరల్ సెక్రటరీ ఎస్.శరత్ శ్యామ్, జాయింట్ సెక్రటరీ కరణ్ సింగ్ హజారే, మనీష్, డాక్టర్ ధన్‌రాజ్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పార్కుల ఆధునికీకరణకు కృషి

అంబర్‌పేట: నియోజకవర్గ పరిధిలో పార్కుల సుందరీకరణకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఆయన రూ.50 లక్షలతో చేపట్టనున్న బాగ్అంబర్‌పేట డివిజన్ రామకృష్ణానగర్ పార్కు సుందరీకరణ పనులను స్థానిక కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే కొన్ని పార్కులను మోడల్ పార్కులుగా తీర్చి దిద్దినట్లు తెలిపారు. ప్రజలకు మరింత ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు పార్కులను ఆధునికీకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



బర్కత్‌పుర పార్కులో అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

ముషీరాబాద్: విద్యార్థులు తాము ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఇతరులు కూడా పాటించేలా చూడాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. మంగళవారం రాంనగర్‌లోని సన్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, మైనర్లు డ్రైవింగ్ చేస్తే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. పీపీటీ ద్వారా స్టాప్ లైన్ ఫ్రీ లెఫ్ట్, ఆపరేషన్ రోప్, కొత్తగా మోటార్ వెహికిల్ 2019 యాక్ట్‌లో వచ్చిన మార్పులు, రోడ్డు గుర్తులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది పద్మావతి, కృష్ణ, మాజీత్, కళాశాల డీన్ సత్యప్రభా, కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయ రామారావుకు నివాళి



విజయరామారావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందిన సీబీఐ మాజీ డైరెక్టర్, మాజీ మంత్రి విజయరామారావు భౌతికకాయాన్ని మంగళవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సందర్శించి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట ముచ్చకుర్తి ప్రభాకర్, రాకేష్‌కుమార్, మానిశెట్టి నర్సింహ్మారావు తదితరులు ఉన్నారు.

అవార్డుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి: అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య 23వ వార్షికోత్సవం సందర్భంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు డాక్టర్ గణగళ్ల విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్య, వైద్యం, విధి నిర్వహణ. సామాజిక సేవ, క్రీడలు, సాహిత్యం తదితర రంగాల్లో ప్రతిభ కలిగిన వ్యక్తులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. రాష్ట్ర స్థాయిలో అర్హులను ఎంపిక చేస్తామని, ఏప్రిల్ 23న నగరంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో పలువురు సినీ, రాజకీయ ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల వారు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9391379903 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

24 నుంచి సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ రవియాదవ్, ధర్మకర్తలు

ముషీరాబాద్: రాంనగర్ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో కొలువుదీరిన సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలను మార్చి 24 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రవి యాదవ్ తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్మకర్తలు, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి మాట్లాడారు. 24న ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25న తులసీ యాత్ర, ప్రబంధ పారాయణం, 26న రక్షాబంధనం, అంకురార్పణ, 27న మండపారాధన, శేష వాహన సేవ, 28న హంస వాహన సేవ, 29న గరుడ వాహన సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 30న జరిగే సీతారామ కల్యాణ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారన్నారు. అనంతరం రాంనగర్ పురవీధుల్లో హనుమంత వాహన సేవ నిర్వహిస్తామన్నారు. 31 మహా పూర్ణాహుతితో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు కె.శ్రీధర్‌రెడ్డి, జె.రజనీ, డి.గోవర్ధన్ యాదవ్, ఏ.శ్రీనివాస్, బి.గోవర్ధన్‌రెడ్డి, కార్యనిర్వహణ అధికారి పి.లక్ష్మారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల వెంకటరమణ చార్యులు, ఎం.వేణుగోపాలచార్యులు, కె.ప్రతాప్ శర్మ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యూ రామాలయంలో చండీ హోమం

నల్లకుంట: మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతీ ఆలయంలో సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కె. జయంతి తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఉదయం 9 గంటలకు చండీ హోమం, పూర్ణాహుతి ఉంటుందన్నారు. హోమంలో పాల్గొనాలనుకునే భక్తులు ఆలయ అర్చక స్వామి కల్యాణ్, ఆలయ గుమాస్తాను సంప్రదించాలని కోరారు. పూజలో పాల్గొనే భక్తులు విధిగా కోవిడ్ నిబంధనలు పాటించాలన్నారు.

బిల్డర్‌పై కేసు నమోదు

ముషీరాబాద్: తనకు అనుకూలంగా వచ్చిన తీర్పు అమలు కోసం పిటిషన్ దాఖలు చేసిన వినియోగదారుడిని బెదిరించినందుకుగాను సన్‌షైన్ ఇన్‌ఫ్రా బిల్డర్ అండ్ డెవలపర్స్ ఎండీ కె.ప్రవీణ్‌కుమార్‌పై అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..సాయినాథ్ అనే వ్యక్తి వినియోగదారుల కమిషన్‌లో ప్రవీణ్‌కుమార్‌పై కేసు దాఖలు చేశాడు. తీర్పు తనకు అనుకూలంగా రావడంతో అమలు కోసం హైదరాబాద్ జిల్లా 2వ వినియోగదారుల కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేశాడు. సదరు కేసులో నోటీసులు అందినా కోర్టుకు గైర్హాజరైనందుకుగాను ప్రవీణ్‌కుమార్‌పై న్యాయస్థానం మొదట బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఇందుకుగాను అతను ఇచ్చిన వ్యక్తిగత పూచీకత్తును ఉల్లంఘించడంతో కమిషన్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కాగా మలక్‌పేట పోలీసులు అతడిని మరో కేసులో డిసెంబర్ నెలలో అరెస్టు చేసి కమిషన్ ఎదుట ప్రవేశపెట్టారు. సదరు కేసులో వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. ఆ తర్వాత కూడా అతను కమిషన్ ఎదుట హాజరుకాకపోవడంతో రెండు కేసుల్లో మరోసారి నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో మలక్‌పేట పోలీసులు ఫిబ్రవరి 21న ప్రవీణ్‌ను అరెస్టు చేసి కమిషన్ ఎదుట హాజరుపరచగా, మార్చి 6వ వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. జిల్లా కమిషన్ బెయిల్ నిరాకరించడంతో రాష్ట్ర కమిషన్ నుంచి బెయిల్ పొందిన అతను జైలు నుంచి విడుదలయ్యాడు. స్టేట్ కమిషన్ ఆదేశాల మేరకు మార్చి 9న జిల్లా కమిషన్-2 ఎదుట హాజరైన ప్రవీణ్‌కుమార్ కోర్టు కారిడార్‌లో తనను అసభ్యపదజాలంతో దూషించి బెదిరించాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా కోర్టు కేసుల జాబితా సీసీ కెమెరాల పుటేజీ కోసం కమిషన్ అబిడ్స్ పోలీసులకు నోటీసులు జారీ చేసింది.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11 కేవీ అజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇండస్ట్రియల్ ఏరియా ఫీడర్ పరిధిలో ఎమ్మార్వో ఆఫీస్, ఆర్టీసీ కల్యాణ మండపం, సోప్ ఫ్యాక్టరీ లేన్, అచ్యయ్యనగర్, రాజేంద్ర ఆయిల్ మిల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన వివరించారు.

నవరస గాయని విజయలక్ష్మి

చిక్కడపల్లి: అభినయం చేస్తూ పాటలను ఆలపించే విజయలక్ష్మి నవరస గాయని అని బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. మంగళవారం అర్చన కల్చరల్ అసోసియేషన్ రజతోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రముఖ గాయని విజయలక్ష్మికి ఘంటసాల పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 ఏళ్లుగా ఘంటసాల పాటలనే పాడుతూ గాయకుడు వెంకటేశ్వరరావు అర్చన వెంకటేశ్వర్‌రావుగా గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో వంశీరామరాజు, కిన్నెర రఘురాం, గాయకులు వినోద్‌బాబు సురేఖమూర్తి, సౌజన త్రిమూర్తులు, రవీంద్రరెడ్డి, కేవీరావు, ఎస్‌వి.రామారావు తదితరులు పాల్గొన్నారు. సభకు కవిహరి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. తొలుత అర్చన వెంకటేశ్వర్‌రావు, విజయలక్ష్మి, అఖిల తదితరులు ఆలపించిన పాటలు సభికులను ఆకట్టుకున్నాయి.

ప్రశ్నాపత్రాల లీకేజీపై విచారణ జరిపించాలి

కాచిగూడ: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై హైకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యులైన ఉన్నతాధికారులను పదవుల నుంచి తొలగించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లీకేజీ కారణంగా వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారన్నారు.

రైల్లో సెల్‌ఫోన్ చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణికుడి సెల్‌ఫోన్ చోరీకి గురైన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్మాస్‌గూడకు చెందిన దీనానాథ్ కాచిగూడకు వచ్చేందుకు రేణిగుంటలో చెన్నై - చెంగల్‌పట్టు రైలు ఎక్కాడు. రైలు కర్నూల్ రైల్వే స్టేషన్ వద్దకు రాగానే అతడి సెల్ ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. మంగళవారం కాచిగూడ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న దీనానాథ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తదుపరి విచారణ నిమిత్తం కర్నూల్ రైల్వే పోలీసులకు కేసును బదిలీ చేశారు.

ఐవీఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా పాండయ్య

రామంతాపూర్: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా రామంతాపూర్‌కు చెందిన సంబు పాండయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఐవీఎఫ్ సెంట్రల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళి గుప్తా మంగళవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రమేష్, భువనగిరి శ్రవణ్, నాగేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ స్థల పరిశీలన



క్యాంప్ కార్యాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఏర్పాటుకు బాగ్‌లింగంపల్లి ఎల్‌ఐజీలో కేటాయించిన స్థలాన్ని మంగళవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ పరిశీలించారు. ఎల్‌ఐజీలోని ఆంధ్ర అప్పర్ ప్రైమరీ స్కూల్‌కు చెందిన 120 గజాల స్థలాన్ని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి కేటాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చేస్తున్న కృషిని ఎనలేనిదన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రత్యేకంగా క్యాంపు కార్యాలయ నిర్మాణాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం నైబర్ హుడ్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ, రాంనగర్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావులపాటి మోజేస్, మన్నె దామోదర్‌రెడ్డి, హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ ఐలినేని కిషన్‌రావు, ముచ్చకుర్తి ప్రభాకర్, సిరిగిరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి కాలుష్యాన్ని నియంత్రించండి

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని అచ్యుతరెడ్డి మార్గ్, మార్క్స్ భవన్ లైన్ తదితర ప్రాంతాల్లో గత కొన్ని నెలలుగా కలుషిత నీరు సరఫరా అవుతుందని ఆయా ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఎమ్మెల్యే ఆ ప్రాంతంలో పర్యటించిన సందర్భంగా ప్రజలు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లో ప్రెజర్‌తో నీరు అందడం లేదని వచ్చిన నీళ్లు కూడా కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సమస్యను పరిష్కరించాలని జలమండలి మేనేజర్, జనరల్ మేనేజర్‌లకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

'నువ్వే ఒక సైన్యం' పాట ఆవిష్కరణ



నువ్వే ఒక సైన్యం పాటను పాడుతున్న వెంకటేష్ ఉప్పల, సుమంత్ బొర్రా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆదిత్య మ్యూజిక్ ఆధ్వర్యంలో రూపొందించిన 'నువ్వే ఒక సైన్యం' పాటను మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ఆవిష్కరించారు. యువ దర్శకులు తల్లాడి సాయికృష్ణ దర్శకత్వం వహించిన 'అచీవర్స్' చిత్రానికి వెంకటేష్ ఉప్పల సంగీతాన్ని అందించారు. హనుమాద్రి శ్రీకాంత్ సాహిత్యం అందించగా సుమంత్ బొర్రా ఈ పాటను స్వరపరిచారు. వెంకటేష్ ఉప్పల, సుమంత్ బొర్రా కలిసి ఈ పాటను ఆలపించారు. కార్యక్రమంలో బిగ్ బాస్ విన్నర్ కౌశల్, రాష్ట్ర టూరిజం బోర్డు చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, రిటైర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న డాక్టర్ సులోచన తదితరులు

అంబర్‌పేట: తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న మహిళా నేతలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు, రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యురాలు డాక్టర్ సులోచన అన్నారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేటలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన మహిళలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికైనా గుర్తించాలని కోరారు. ఉద్యమంతో సంబంధం లేని వ్యక్తులకు సైతం ఎన్నో అవకాశాలు ఇచ్చారని, తమలాంటి వారికి కూడా అవకాశం ఇవ్వాలని కోరారు. తెలంగాణలో మహిళలకు ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. సమావేశంలో పల్లవి, అరుణ, వైశాలి, బాలమణి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మ వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం డివిజన్‌లోని శ్రీనివాసనగర్‌లో కొనసాగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చేపట్టిన మ్యాన్‌హోళ్ల నిర్మాణం అస్తవ్యస్తంగా ఉందని ఆమె అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, బీజేపీ నాయకులు చుక్క జగన్, మిర్యాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

కాచిగూడ: విద్యార్థినులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని కేర్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ స్వాతి అన్నారు. విద్యార్థినులకు ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించేందుకు మంగళవారం బద్రుకా కళాశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆమె పాల్గొన్నారు. పీసీఓఎస్, పీసీఓడీ తదితర సమస్యలు ఎదురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బ్రెస్ట్ కేన్సర్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బద్రుక హెల్త్ సెంటర్ డాక్టర్ పూర్ణ చంద్రమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ ఎం.జానకిరామ్, ఈవీసీఎం శాస్త్రీ, ఎన్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.మమత, జె.లావణ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిక్కా దేవదాసుకు సేవా భూషణ్ అవార్డు

చిక్కడపల్లి: ఓంకార సత్సంగ వ్యవస్థాపక అధ్యక్షులు, చేనేతవర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షులు చిక్కా దేవదాసుకు సేవా భూషణ్ అవార్డు దక్కింది. మంగళవారం త్యాగరాయ గానసభలో సెవెన్‌హిల్స్ సాంస్కృతిక సంస్థ 20వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేటర్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారి, సామాజికవేత్త కొత్త కృష్ణవేణి, వికలాంగ హక్కుల పోరాటవేదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వర్‌రావు, టీవీ నిర్మాత, దర్శకులు డి.సురేష్‌కుమార్, సరస్వతీ ఉపాసకులు దేవజ్ఞశర్మ దేవదాసును అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత దేవదాసు మాట్లాడుతూ మూడు దశాబ్దాల తన సామాజిక సేవను గుర్తించి అవార్డు అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఏడుకొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ నిర్మాణం వేగవంతం చేయాలి

చిక్కడపల్లి: మాధవరావు లేన్‌లో నిర్మాణంలో ఉన్న పైప్ లైన్ పనులను పది రోజుల్లో పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. మాధవరావు లేన్‌లో సీవరేజ్ పైప్‌లైన్ పనుల కారణంగా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆమె వాటర్‌వార్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్‌లతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. సీవరేజ్‌లైన్ ఏర్పాటు సమయంలో నీటి పైప్‌లైన్‌లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినయ్ కుమార్, మహమూద్, లక్ష్మణ్ యాదవ్, గోపి, నర్సింహ, అరుణ్‌కుమార్, మాధవరావు కాలనీ వాసులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఆందోళన..

ఉస్మానియా యూనివర్సిటీ: అధ్యాపకుల అర్హత పరీక్ష టీఎస్‌సెట్-2022 తొలిరోజు గందరగోళం నడుమ ప్రారంభమైంది. కార్యదర్శి ప్రొ.మురళీకృష్ణ పరీక్ష నియమ నిబంధనల గురించి పూర్తి సమాచారాన్ని అభ్యర్థులకు చేరవేయకపోవడంతో వందలాది మంది సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోలేకపోయారు. నాచారం, మల్లాపూర్ సెంటర్లలో అనేక మంది అభ్యర్థులను అధికారుల అనుమతించలేదు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే పరీక్ష సమయానికి 10 నిమిషాల ముందే చేరుకున్నా అధికారులు అడ్డుకున్నారు. దీంతో అభ్యర్థులు ఓయూ క్యాంపస్‌లోని టీఎస్‌సెట్-2022 సభ్య కార్యదర్శి ప్రొ.మురళీకృష్ణకు విషయం చెప్పేందుకు వెళ్లగా పోలీసులు అడ్డుకొని దాడి చేశారని అభ్యర్థులు ఆరోపించారు.